# అమ్మా నాన్నలు

-సాహితి

అమ్మా!

నాన్న యాక్సిడెంట్‌లో చనిపోయారు. పిన్ని తమ్ముణ్ణీ చెల్లినీ తీసుకుని వాళ్ళూరు వెళ్ళిపోతుందట. నన్నెవరూ ఎక్కడికీ తీసికెళ్తామనడంలేదు. నేనిప్పుడేం చెయ్యాలి? ఎక్కడికెళ్ళాలి?

ప్రియ

ఉత్తరం చదవటం ముగించి భార్య మొహంలోకి చూశాడు భార్గవ. మబ్బు పట్టిన ఆకాశంలా ఉంది. ఏడ్చేడ్చి ఎర్రగా మంకెనపూలల్లా తయారయ్యాయి కళ్ళు. ఇంకా దుఃఖాన్ని ఉగ్గబట్టుకుంటున్నట్టే ఉంది.

మధ్యాహ్నం ఏదో అవసరమై ఆమె ఆఫీసుకి ఫోన్ చేశాడు. హాఫ్‌డే లీవుపెట్టి ఇంటికి వెళ్ళిపోయిందని రిప్లై వచ్చింది. ఇదన్నమాట సంగతి! అతని భృకుటి ముడిపడింది.

హేమంత డైవోర్సీ. చచ్చిపోయింది ఆమె మొదటి భర్త. ఉత్తరం అతని కూతుర్నించీ. తెగిపోయిన ఆ బంధాన్ని గురించి ఆమె ఏడవటం అతనికే మాత్రం నచ్చలేదు. అసహ్యంగా అనిపించింది.

అతని మనోగతభావాలను పట్టించుకునే స్థితిలో లేదు హేమంత. ఎంత విడాకులిచ్చేసినా చనిపోయిన వ్యక్తితో తను ఏడాది పాటు గడిపింది. సహజీవనం... అంటే పగలూ రేయీ అతన్తో గడిపింది. భావాలూ, ఉద్వేగాలూ పంచుకుంది. ఆ తర్వాతే స్పర్థలొచ్చాయి. విడిపోయారు. పాపని అతనివ్వలేదు. కోర్టు చుట్టూ తిరగలేక మనసు రాయి చేసుకుంది. కూతుర్నివైపు దారి మూసుకుపోయి మళ్ళీ ఇలా తెర్చుకుంది. ఇదిగో, ఈ ఉత్తరం! గుండెల్లో అలజడిని రేపుతూ వచ్చింది.

'ఐతే ఏమంటావు?' ఉత్తరాన్ని టేబుల్ మీద పడేస్తూ కటువుగా అడిగేడు భార్గవ. అతనికి భార్య కష్టసుఖాలు పట్టవు. భార్యాభర్తలిద్దరికీ మధ్య అగాధమంత దూరం.

'వెళ్ళి తీసుకొస్తాను'

హేమంత మాటలు వినగానే అతను విసురుగా కుర్చీ నెట్టేసి లేచాడు.

'నీకు భర్త అవసరం. నా పిల్లలకి తల్లి అవసరం. మన మధ్యనున్న పెళ్ళి ఒప్పందం. ఇంతే!' అన్నాడు.

అప్పటిగ్గానీ అతనికి కోపం వచ్చిందని గుర్తించలేదు హేమంత. తెల్లబోయింది. ఇలాంటప్పుడు కోపాలూ పంతాలూనా?' అంటే దాన్నిలా దిక్కులేనిదాన్లా వదిలెయ్యమంటావా?' అడిగింది.

'జవాబు చెప్పాల్సిన అవసరం నాకు లేదు'

'కానీ దానికోదారి చూపించాల్సిన బాధ్యత నాకుంది'

'ఐతే నీ దారి నువ్వు చూసుకో. ఐనా ఒకసారి దారి తప్పిన దానివి రెండోసారి ప్రాబ్లమేం వుండదులే' వెటకారంగా అన్నాడతను.

అకారణంగా దాచిపెట్టి చెంప మీద కొట్టినట్టయింది. ఇలా జరుగుతుందని తను మాత్రం అనుకుందా? అనుకోని సమస్యలు ఎదురైనప్పుడు అండగా నిలబడి పరిష్కారం వెతకడంలో సాయపడకుండా ఇంత మీన్‌గా ప్రవర్తిస్తాడేంటి? ప్రియ ఎవరు? తన కూతురు. తన శరీరంలోంచే ఉద్భవించి, తనకి కొంత ఆనందాన్నిచ్చి, అనిర్వచనీయమైన అనుభూతిని పంచిచ్చిన తొలి సంతానం. అతనికి అతని పిల్లలెంతో తనకి అదీ అంతే. అతని పిల్లల్ని తను తల్లై లాలిస్తోంది. మరి ప్రియ భార్గవకేం కాకపోవటమేమిటి?

తామేం సుఖాలని పంచుకోవడానికని పెళ్ళి చేసుకోలేదు. ఇద్దరూ కష్టంలో వున్నారు కాబట్టి ఒకరికొకరు తోడౌతారనుకున్నారు. దానికితను విపరీతార్థాలు తీస్తాడేంటి? ఆలోచిస్తున్న కొద్దీ ఆమె గుండె గాయం లోతెక్కుతోంది. అప్పుడు ప్రియ తండ్రీ! ఇప్పుడితను! ఆడవాళ్ళ మనసుని అర్థం చేసుకోరెందుకని ఈ మగవాళ్ళు?

భార్గవ ఇష్టాయిష్టాలని గానీ, అహం, అభిజాత్యాలని గానీ పట్టించుకోదల్చుకోలేదు హేమంత. జర్నీబేగ్‌లో జత బట్టలు పడేసుకుని బయల్దేరింది.



'అమ్మా! ఊరెళ్తున్నావా? మళ్ళీ ఎప్పుడొస్తావు?' అని భార్గవ చిన్నకూతురు, ఏడేళ్ళది బేలగా అడిగినప్పుడు మాత్రం కన్నీళ్ళాపుకోలేకపోయింది.

తన కోసం ప్రియ అంతే ఆరాటంగా ఎదురుచూస్తుంటుందని గుర్తొచ్చి ఆ పిల్లని గుండెకి హత్తుకుని బావురుమంది.

'ఛ... ఏడుపుగొట్టుగోల. కష్టాలన్నీ తీర్చి సుఖంగా బతకమని దేవుడు వరమిచ్చినా కొంతమందికి సుఖపడే రాత వుండదు...' విసురుగా కూతుర్ని ఆమె చేతుల్లోంచీ లాక్కుని అక్కణ్ణుంచీ వెళ్ళిపోయాడు.

ఆ పిల్ల 'అమ్మా! అమ్మా!' అని ఏడుస్తుంటే-

'ఎవరే నీకు అమ్మ? మీ అమ్మెప్పుడో చచ్చిపోయింది. ఆ మాట ఎత్తావంటే వీపు చీరేస్తాను' అని అరిచాడు.

సుదీర్ఘంగా విశ్వసించి ఇంట్లోంచీ కదిలింది హేమంత.

★ ★ ★

హేమంత అటు వెళ్ళగానే ఆమె తండ్రికి ఫోన్ చేశాడు భార్గవ. ఉత్తరం సంగతి, తనొద్దన్నా వినకుండా ప్రియని తీసుకురావడానికి హేమంత వెళ్ళిన వైనమూ చెప్పాడు.

'ఏంటీ? సూర్యనారాయణ చచ్చిపోయాడా?' ప్రాన్పడిపోయి అడిగాడు హేమంత తండ్రి. తండ్రిని కోల్పోయి, ఆదరించే దిక్కులేక మనవరాలక్కడ ఒక్కర్తీ ఎలా ఉందోనన్న బాధ పెద్దపెట్టుని ఆయన్ని ఆవహించింది. హేమంత వెళ్ళిందన్న వార్తతో కొంత వూరట... అంతలోనే దాని పరిణామాలెలా ఉంటాయోనన్న భయం వెంటవెంటనే కలిగాయి.

తెగతెంపులు చేసుకున్న మనుషుల కోసం వీళ్ళెందుకింత తెగ బాధపడిపోతున్నారో అర్థమవలేదు భార్గవకి.

'నేను చెప్తున్నది చచ్చిపోయిన మనిషి గురించీ కాదు. బతికున్న నా గురించి. మీ కూతురసలు ఏ ఉద్దేశంతో నా మాట లక్ష్యపెట్టకుండా వెళ్ళింది? మా పెళ్ళి మాటలప్పుడు మీరేం చెప్పారు? ఆ మొదటి పెళ్ళికి సంబంధించిన జోక్యం ఏదీ వుండదన్నారు. ఇప్పుడిలా? ఛఛ... మాట నిలకడలేని మనుషులు' అన్నాడు.

'అంతంత మాటలు దేనికి భార్గవా? హేమంత రాగానే అందరం కలిసి ఏం చెయ్యాలో ఆలోచిద్దాం. నిన్ను బాధపెట్టేలా ఏదీ నిర్ణయింపబడదని నేను మాటిస్తున్నాను' అని ఫోన్ పెట్టేశాడాయన.

భార్గవకి కొంత ఉపశమనం కలిగింది.

★ ★ ★

ప్రియనీ, ప్రియకి రావల్సిన డబ్బునీ తీసుకుని పుట్టింటికి వచ్చింది హేమంత. తండ్రి ఆస్తిలో ఆ పిల్లకి రావాల్సిన వాటా కూడా ఇచ్చేస్తామన్నారు. డబ్బుతో అన్ని సమస్యలూ పరిష్కారం కావు. సూర్యనారాయణ చనిపోవటమే పెద్ద షాక్ హేమంతకి. అంటే అతన్నింకా మర్చిపోలేదని కాదు. అతని అర్థాంతరపు చావు వల్ల ప్రియ తన దగ్గరకి చేరటం. డైవోర్సు తీసుకున్నాక ఎన్నో ఏళ్ళు వొంటరిగా అలమటించింది తను. తల్లీ తండ్రీ తనకి అండగా వున్నా, భర్తా కూతురూ వుండీ లేకపోవడం చాలా బాధ కలిగించేది. పరిచయస్తుల ద్వారా భార్గవ మేచ్ వచ్చింది. తనకంటూ ఓ ఇల్లు ఏర్పడిందని సంతోషపడింది. సెటిలవ్వబోతూ వుంటే ఈ సంఘటన జరిగింది. భార్గవ ఈ విషయంలో ఎలాంటి సహకారమూ ఇవ్వడు. మళ్ళీ ఇక్కడ కూడా వైఫల్యమేనా?

'నువ్వెళ్ళగానే భార్గవ నాకు ఫోన్ చేసాడు హేమంతా!' తండ్రి అన్నాడు.

'ఏమన్నాడు?' ఆతృతగా అడిగింది.

'నువ్వక్కడికి వెళ్ళే ముందు ఇద్దరూ పోట్లాడుకున్నారా?'

'పోట్లాటంటూ ఏమీ లేదు. లెటర్ చూపించాను. ఏం చేద్దామని అడిగే అవకాశం నాకివ్వలేదు. ఔట్‌రైట్‌గా వెళ్ళద్దనేశాడు. వెళ్ళకుండా ఎలా? ప్రియ పొజిషనేంటి?'

'అతనికి బాగా కోపం వచ్చిందనుకుంటాను. మరిప్పుడేం చేద్దామమ్మా?' 'అదే నాకూ అర్థమవడంలేదు' నిస్పృహయంగా అందామె.

'దాన్నిక్కడొదిలేసి నువ్వతని దగ్గరికి వెళ్ళిపోవే. మాకు మాత్రం బాధ్యతలేం ఉన్నాయి?

మేం పెంచి పెద్ద చేస్తాం. మధ్యలో నువ్వొచ్చి చూసి వెళ్తువుగాని' అంది హేమంత తల్లి.

